క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న కలెక్టర్ దంపతులు



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కి అప్పన్న చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం కలెక్టర్ హరేందిరప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రం ఏఈతో తిరుమలేశ్వరరావు అందజేశారు.

సిరులతల్లికి తులసిపూజ

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవకు పలువురు ఉభయదాతలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లీ హెల్త్ డొమైన్, లీ ఫార్మా లిమిటెడ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్‌తో పాటు 147 మంది ఉద్యోగులు పరీక్షలు చేయించుకున్నారు. లీ ఫార్మా డైరెక్టర్ అల్లా లీలా రాణి, క్యాంప్ కో–ఆర్డినేటర్లు సరోజిని, జయలక్ష్మి, డాక్టర్ రాధిక, పోషకాహార నిపుణురాలు మాధురి, జి.ఎస్.ఎం. భాగ్యలత సేవలందించారు. జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, ఏవో బి.వి.రాణి, ఏపీఆర్ఎస్ఏ ప్రతినిధులు రాజేంద్రవర్మ, త్రినాథ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు సీపీకి ఆహ్వానం



సీపీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్‌లో వేంచేసిన దుర్గామల్లేశ్వరి ఆలయంలో ఈ నెల 22 నుంచి నిర్వహించనున్న దసరా ఉత్సవాలకు పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీకి ఆహ్వానం పలికారు. ఉత్సవాలు ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ అభివృద్ధి సంఘం ప్రతినిధులు, ఆలయ చైర్మన్ మార్గాన వెంకటేశ్వరరావు, వీపీ రాజుగౌడ్ కమిషనర్‌కు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు మహేష్, కృష్ణ, రవి, పల్లా దుర్గ తదితరులు ఉన్నారు.

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ఉద్యోగులు నిర్ణీత సమయానికే విధులకు హాజరు కావాలని అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ఆదేశించారు. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్(ఫైనాన్స్) ఎస్ఎస్ వర్మతో కలిసి అన్ని జోన్ల కార్యాలయాల పర్యవేక్షకులు, జీవీఎంసీ ప్రధాన కార్యాలయ పర్యవేక్షకులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు తప్పనిసరిగా వారి వారి సీట్లలో కూర్చోవాలని, సాయంత్రం 5.30 గంటల వరకు తప్పనిసరిగా విధులు నిర్వహించాలన్నారు. అంకిత భావంతో పనిచేసి, ప్రజల మన్ననలు పొందాలన్నారు. ప్రతి ఉద్యోగి తమ సీటు వదలి బయటికి వెళ్లాల్సి వస్తే మూమెంట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు.

శాస్త్రీయ, ఆధ్యాత్మిక మ్యూజియం నిర్మాణానికి వినతి

దాబాగార్డెన్స్: సింహాచలం కొండపై శాస్త్రీయ, ఆధ్యాత్మిక విజ్ఞానంతో కూడిన మ్యూజియం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ ప్రతినిధి రామేశ్వరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మ్యూజియం ఏర్పాటుకు గత ఏడాది అక్టోబర్ 27న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. మరలా ఈ నెల 4న కేబినెట్ అనంతరం ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లినట్లు చెప్పారు. విశాఖలో ఇలాంటి శాస్త్రీయ ఆధ్యాత్మిక మ్యూజియం నిర్మించడం అవసరమన్నారు.

భక్త సిరి.. సాగరగిరి

- యారాడ కొండపై కొలువై ఉన్న సాగర గిరి కనక దుర్గమ్మ
- నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారి పూజలకు సర్వం సిద్ధం
- 22 నుంచి అక్టోబర్ 2 వరకు బోటు సౌకర్యం



విశేష అలంకరణలో సాగర గిరి దుర్గమ్మ



సాగరి గిరి దుర్గమ్మ కొలువై ఉన్న యారాడ కొండ (డాల్ఫిన్ నోస్)

అల్లిపురం: నగరవాసులకు బోటు ఎక్కే **అవకాశం** సాగర గిరి కనకదుర్గమ్మ కల్పించి**ంది. ఏడాది** పాటు బోటు ఎప్పుడు ఎక్కుదామా **అని ఎదురు** చూసే వారికి ఆ అవకాశం రానే వచ్చి**ంది. మరింకెం**దుకు ఆలస్యం బోటు ఎక్కేద్దామా.. సాగర **గిరి కన**కదుర్గమ్మను చూసొచ్చేద్దామా.. సిద్ధం **కండి.**

ఉత్సవాలకు సర్వం సిద్ధం..

దసరా ఉత్సవాలకు యారాడ కొండ **ముస్తాబయిం**ది. ఈ మేరకు విశాఖపట్నం పోర్టు **ట్రస్ట్ ఆధ్వర్యం**లో నిర్వహిస్తున్న సాగర గిరి కనక **దుర్గమ్మ గుడి** కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి**ంది. తొమ్మిది** రోజుల పాటు అమ్మవారికి విశేష **పూజా కార్యక్ర**మాలు నిర్వహించనున్నారు. సోమవార**ం ఉదయం** 9 గంటలకు కలశ ప్రతిష్ఠతో **అమ్మవారి** నవరాత్రులు ప్రారంభమవుతాయి. 22**న బాలాత్రి**పుర సుందరిగా, 23న గాయత్రీదేవిగా, 24న రాజరాజేశ్వరీదేవిగా, 25న లలితాదేవిగా, 26న మహాలక్ష్మీదేవిగా, 27న భువనేశ్వరీదేవిగా, 28న అన్నపూర్ణాదేవిగా, 29న సరస్వతీదేవిగా, 30న చండీదేవిగా, అక్టోబర్ 1వ తేదీన శాకంబరీదేవిగా, 2వ తేదీన సాగర గిరి కనక దుర్గాదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నట్లు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

సాగర గిరి దుర్గమ్మ చరిత్ర ఘనం..

పోర్టు నిర్మాణం సమయంలో (1970)లో యారాడ కొండపై సాగరదుర్గను నెలకొల్పారు. పెద్ద నౌకలు వచ్చేందుకు వీలుగా నేచురల్ హార్బర్ అయిన డాల్ఫిన్ నోస్ వద్ద పోర్టు కాంట్రాక్టర్ తవ్వకాలు జరుపుతుండగా ఒక రోజు కాంట్రాక్టర్‌కు అమ్మవారు **కలలో కనిపించి వారు తవ్వకాలు జరుపుతున్న చోట తన విగ్రహం ఉందని తెలిపింది. అమ్మవారు చెప్పిన ప్రాంతంలో తవ్వుతుండగా అమ్మవారి విగ్రహం కనిపించింది. దీంతో పండితులు, పీఠాధిపతుల సూచనల మేరకు యారాడ కొండపై సముద్ర మట్టానికి 200 మీటర్ల ఎత్తులో ఆలయం** నిర్మించి అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించారు. **యారాడ కొండపై ఆహ్లాదకర వాతావరణంలో అమ్మవారి దేవాలయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. అమ్మవారి దేవాలయం చుట్టూ భారతదేశంలో వివిధ ప్రాంతాలలో పూజలందుకుంటున్న అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో శివాలయం, నవగ్రహాలు, వినా**యకుని ఆలయాలు ఉన్నాయి.

భక్తుల దర్శనార్థం బోటు సౌకర్యం..



బోటు ప్రయాణం

సాగర గిరి కనకదుర్గ దేవాలయానికి నగరం నుంచి వెళ్లాలంటే సాగరాన్ని దాటాల్సి ఉంటుంది. అక్కడికి చేరుకోవడానికి నగరం నుంచి రోడ్డు మార్గం లేదు. పోర్టు అథారిటీ అనుమతితో బోటు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు బోటు యజమాని గుప్త తెలిపారు. ప్రతి రోజు పాత పోస్టాఫీసు దరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద గల ఫెర్రీ నుంచి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బోటు సౌకర్యం అందుబాటులో ఉంటుందని వివరించారు. పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20గా టికెట్టు నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

13 గంటల పని విధానాన్ని వ్యతిరేకించండి

దాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్మికులకు ప్రకటించిన 13 గంటల పని విధానాన్ని వ్యతిరేకించాలని సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ 1919లో 8 గంటలే పని గంటలు ఉండాలని, 48 గంటలు వారానికి పని చేయాలని రికమండ్ చేసిందన్నారు. ఇదిలా ఉండగా చంద్రబాబునాయుడు కార్మికులు, ఉద్యోగులను రోజుకి 13 గంటలు పని చేయమని ఆదేశిస్తున్నారని, రాష్ట్ర శాసనసభ చట్టం కూడా చేసిందన్నారు. చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికులకు 13 గంటలు పని చేయాలని రాసి ఉంటే బాగుండేదని, చంద్రబాబునాయుడు కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా ఈ పద్ధతిని అమలు చేస్తామంటున్నారని కుమార్ తెలిపారు. ఇది కార్మిక హక్కులకు నష్టదాయకమని, ఇప్పటికే రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య అధికమైందని, ఈ పని గంటలు మార్పు జరిగితే మరింత నిరుద్యోగం పెరుగుతుందని చెప్పారు. 8 గంటల పని కార్మికులు పోరాడి సాధించుకున్నదని తెలిపారు. దీనిని నిరసిస్తూ కార్మికులు పరిశ్రమల వద్ద నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

కూటమి హామీలు మోసపూరితం



33వ వార్డులో ప్రచారం చేస్తున్న రమేష్ తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో ఆ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో శనివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. 74వ బూత్ కంఠంవారి వీధిలో గడప గడపకు వెళ్లి బాబు ఇచ్చిన హామీలు మోసపూరితమైనవని, ప్రజల్ని మోసం చేస్తున్న విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పచ్చిరపల్లి రాము, హేమలక్ష్మి, బూర్లు చిన్న, కనిగిరి సంతోష్‌కుమార్, సలాది భాను, కొల్లు సత్యవతి, పీవీఎన్ రెడ్డి, బి.శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, సిద్దేశ్వరరావు, ధర్మారావు, అనంతలక్ష్మి, శ్రావణి, అభి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆసరా



ఆటోడ్రైవర్ భార్యకు సరుకులు అందజేస్తున్న భీశెట్టి చంద్రశేఖర్ తదితరులు

అల్లిపురం: ఇటీవల నీలమ్మ వేపచెట్టు ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ బొంత అప్పలరాజు ఆటోలోనే గుండెపోటుతో మరణించాడు. దీంతో అతని కుటుంబం రోడ్డున పడింది. ఇంటికి పెద్ద దిక్కు మరణించడంతో అతని కుటుంబాన్ని ఆదుకోవాలని అతని స్నేహితులు నిర్ణయించుకున్నారు. భీశెట్టి చంద్రశేఖర్ చొరవతో మిగిలిన స్నేహితులు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, శీరపు ప్రసాద్‌రెడ్డి, పంది సంజీవ్, అశోక్ నెల రేషన్ అప్పలరాజు భార్యకు శనివారం అందజేశారు.

పరిశుభ్రత.. పచ్చదనమే ధ్యేయం



ప్రతిజ్ఞ చేస్తున్న డివిజనల్ పీఆర్‌వో నారాయణ, డీడీ సదారావు, సీఈవో కవిత తదితరులు



పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ ప్రతిజ్ఞ చేస్తున్న ఎంజీఎం ఉపాధ్యాయులు, విద్యార్థులు



కేజీహెచ్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్ వాణి తదితరులు

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖ, సెట్విస్ శాఖ కార్యాలయాల ఉమ్మడి ప్రాంగణంలో స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమాలు శనివారం జరిగాయి. రెండు కార్యాలయాల అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని ఆవరణలోని పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించారు. థీమ్ గ్రీన్ ఏపీకి అనుగుణంగా మొక్కలు నాటారు.

వాటికి నీరు పోసి రక్షణ కంచెలు ఏర్పాటు చేశారు. సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ కె. సదారావు, సెట్విస్ ఇన్‌చార్జి సీఈవో కవిత, ఇతర అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డివిజనల్ పీఆర్‌వో నారాయణరావు, సెట్విస్ సూపరింటెండెంట్ ఎస్.ఎస్. సుధాకర్, ఇతర అధికారులు వెంకటరావు, రామకృష్ణ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో..

కేజీహెచ్‌లో జరిగిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, డాక్టర్లు, నర్సులు, నర్సింగ్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. గ్రీన్ ఏపీ అంశంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన నర్సింగ్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ వాసవీలత, డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు, అడ్మినిస్ట్రేటర్ బి. వి. రమణ, స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర నోడల్ అధికారి డాక్టర్ ఎ.రాజేష్, ఆర్ఎంవో డాక్టర్ బంగారయ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ సి.హెచ్.పద్మావతి. మినిస్టీరియల్, మలేరియా సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ ఉద్యోగుల ర్యాలీ..

హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంపై జిల్లా పరిషత్ ఉద్యోగులు శనివారం జిల్లా పరిషత్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. సీఈవో నారాయణ మూర్తి ఆధ్వర్యంలో ప్లానింగ్ విభాగాధికారి పీవీవీఎస్ మూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి డి.మంజువాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ని వీడండి.. పర్యావరణాన్ని కాపాడండి

అల్లిపురం: దాబాగార్డెన్స్‌లోని మహాత్మాగాంధీ హైస్కూల్లో అల్లిపురం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ప్రధాన ఉపాధ్యాయుడు నాగభూషణం, ఉపాధ్యాయులు, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రంథాలయ అధికారి పి.వి.ఎస్. రాజు, విద్యార్థులు స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. ప్రకృతి పచ్చదనం, ప్లాస్టిక్ నివారణ గురించి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానం విశాఖ

దాబాగార్డెన్స్: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, ఎగుమతుల్లో దాదాపు 45 శాతం వాటాను కలిగి, 11 కోట్ల మందికి పైగా ఉద్యోగాలు కల్పిస్తుందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారిత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఫిక్కీ సెంటర్ ఫర్ సస్టైనబిలిటీ లీడర్ షిప్, విశాఖపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంయుక్తంగా పర్యావరణ, సామాజిక పాలన సూత్రాలు, ఎంఎస్ఎంఈల సుస్థిరవృద్ధి అనే అంశంపై నగరంలోని ఓ హోటల్లో అవగాహన సమావేశం నిర్వహించాయి. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ జీఎస్టీ హేతుబద్ధీకరణ, సంస్కరణలను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు, వీసీసీఐ అధ్యక్షుడు సుదర్శన స్వామి, కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శివరాంప్రసాద్, సెంట్రల్ బ్యాంక్ డీజీఎం ఏవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అకౌంట్లను మార్చే ప్రసక్తే లేదు



మాట్లాడుతున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు

దాబాగార్డెన్స్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని కార్మికుల అకౌంట్లను ప్రైవేట్‌కు చెందిన యాక్సిస్ బ్యాంకులోకి మార్చడానికి సిటు వ్యతిరేకమని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిటు) గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు తెలిపారు. పర్మినెంట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు యాక్సిస్ బ్యాంకుకు మారవద్దని, పెండింగ్ సమస్యల పరిష్కారానికి నిరవధిక సమ్మెకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజుతో కలిసి శనివారం సిటు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. జీవీఎంసీలో పర్మినెంట్ ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్/అవుట్‌సోర్సింగ్ కార్మికులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి తమ అకౌంట్లు యాక్సిస్ బ్యాంకుకు మార్చుకోవద్దని సిటు పిలుపునిస్తుందన్నారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంవీ ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు జీఆర్ నాయుడు, గొలగాని అప్పారావు, ఆదినారాయణ, శ్రావణ్ పాల్గొన్నారు.

పేదల పాలిట శాపంగా కూటమి ప్రభుత్వం

అల్లిపురం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదల పాలిట శాపంగా మారిందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని బతుకుతున్న చిరు వ్యాపారులను తొలగించడం బాధాకరమన్నారు. తక్షణం షాపులకు అనుమతించి వారి జీవనోపాధి సాగించుకునేలా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే కోర్టుకెళ్లి పర్మిషన్ తీసుకొస్తామని తెలిపారు.

మహిళకు వాసుపల్లి ఆర్థిక సాయం



బాధితురాలికి ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: బ్లడ్ ఇన్ఫెక్షన్ సమస్యతో బాధపడుతున్న దొంలపిల్లి పావని (23)కి మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రూ. 5 వేలు అందజేశారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ద్వారా విషయం తెలుసుకున్న ఆయన కొబ్బరి తోటలో ఉంటున్న ఆమె ఇంటికి శనివారం వెళ్లి పరామర్శించారు. డెలివరీ అయినప్పటి నుండి భరించలేని బాడీపెయిన్స్‌తో మంచాన పడింది. భర్త కూడా విడిచి వెళ్లిపోవడంతో ఆమె తల్లి ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ మెడికల్ ఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉండగా గతంలో ఆయన సాయం అందించారు. మరోసారి ఆమె ఇంటికి వెళ్లి సొంత నిధులతో సహాయం అందజేశారు. మెడిసిన్ ఖర్చులకు నెలకు రూ.12వేలు ఖర్చు అవుతుందని, ఈ మందులను కేజీహెచ్ ద్వారా ఉచితంగా అందజేయాలని, ఇతర అరుదైన వ్యాధులకు మంజూరు చేసే విధంగా ఈమెకు నెలకు రూ.10 వేలు పెన్షన్ మంజూరు చేయాలని వాసుపల్లి కలెక్టర్‌తో మాట్లాడారు . కార్యక్రమంలో 34వ వార్డ్ కార్పొరేటర్ తోట పద్మావతి, లింగం శ్రీను, లండ రమణ, జిల్లా వలంటీర్ విభాగం వైస్ ప్రెసిడెంట్ దూడ అప్పారావు, జిల్లా స్టూడెంట్ వింగ్ వైస్ ప్రెసిడెంట్ గరికిన వెంకటేష్, అంబటి అప్పలరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్, రామరాజు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ క్రో సక్సెస్

- చావు బతుకుల్లో పడి ఉన్న కాకికి బాలుడి చేయూత
- మిగిలిన కాకులు పొడిచేందుకు ప్రయత్నించినా వెనక్కి తగ్గని వైనం



చావు బతుకుల మధ్య ఉన్న కాకిని రక్షించే ప్రయత్నంలో నీళ్లు పోస్తున్న బాలుడు

దాబాగార్డెన్స్: పక్కవాడికి ఏమైతే మనకెందుకు? అన్న ఈ రోజుల్లో ఓ బాలుడు తన స్కూల్ సమీపాన ఓ కాకి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడడం చూశాడు. ముందు చనిపోయిందనుకున్నాడు. కాసింత ముందుకెళ్లి ఆ కాకిని మరలా చూశాడు. కాకిలో చిన్న కదలికలు కనిపించాయి. దాంతో కాకి వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. పైనుంచి పలు కాకులు అరుస్తున్నాయి. ఆ కాకులు పొడుస్తాయని తెలియలేదు. అయినప్పటికీ మూలన పడి ఉన్న కాకికి తన స్కూల్ బ్యాగ్‌లో ఉన్న వాటర్ బాటిల్‌లోని నీరు తీసి పోశాడు. ఆ కాకిలో మరింత కదలిక వచ్చింది. కొంచెం పైకి లేచింది. మరికొంచెం నీళ్లు పోశాడు. చిన్నగా ఎగురుకుంటూ కొంత ముందుకు రావడంతో పైన ఉన్న కాకులు కావు కావుమంటూ ఆ బాలుడి పైకి రావడం ప్రారంభించాయి. చావుబతుకుల మధ్య ఉన్న ఆ కాకిని కాపాడాడు. కాకులు ఆ బాలుడ్ని పొడుస్తుండడంతో అక్కడి నుంచి పరుగులు తీశాడు. ఇది చూసిన స్థానికులు బాలుడ్ని అభినందించారు.

కార్డుప్రైమ్ 2.0లో సడలింపులకు వినతి



పెన్‌డౌన్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్యుమెంట్ రైటర్లు

జగదాంబ: రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఆలస్యం అవుతున్న కారణంగా కార్డు ప్రైమ్ 2.0 విధానంలో సడలింపులివ్వాలని కోరుతూ డాక్యుమెంట్ రైటర్స్ పెన్‌డౌన్ కార్యక్రమం రెండవ రోజు కొనసాగింది. శనివారం టర్నర్ చౌల్ట్రీ దగ్గరున్న రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ యూనియన్‌కు చెందిన మజ్జి మురళి మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో కూడా కార్డు ప్రైమ్ 2.0ను తీసుకొచ్చారన్నారు. అయితే రిజిస్ట్రేషన్లలో ఇబ్బందులు తలెత్తుతుండడంతో అధికారులకు తెలియచేస్తే ఆ విధానంలో సడలింపులిచ్చి రిజిస్ట్రేషన్ సులభతరం చేశారన్నారు. మరలా కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. ఆ విధానం వల్ల ఎక్కువగా ఓటీపీలు వస్తాయని, బిల్డర్‌తో పాటు ఎంత మంది ఉంటే అందరికి ఓటీపీలు వస్తాయన్నారు. ఈ నేపథ్యంలో సర్వర్‌లో ఇబ్బందులు వస్తే మళ్లీ ఓటీపీల పర్వం ముందుకు వస్తుందన్నారు. దీని వల్ల రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఈ విధానాన్ని సులభతరం చేయాలని కోరుతున్నట్లు తెలిపారు.

చిరు వ్యాపారుల దుకాణాలు తొలగించరాదు

అల్లిపురం: చిరువ్యాపారుల దుకాణాలు అక్రమంగా తొలగించే కార్యక్రమాన్ని జీవీఎంసీ ఆపాలని ఏఐటీయూసీ విశాఖ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎం. మన్మథరావు, కె. సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పొట్ట కూటి కోసం, కుటుంబాలను పోషించుకునేందుకు చిల్లర వ్యాపారులు, తోపుడు బళ్ల విక్రేతలు పోరాటం చేస్తున్నారని అన్నారు. ఇటువంటి దుర్మార్గపు చర్యలను ఏఐటీయూసీ విశాఖ జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఏఐటీయూసీ నాయకులు ఎన్. నాగభూషణం, సీహెచ్ కాసుబాబు, లక్ష్మణరావు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు మతిస్థిమితం లేని వ్యక్తి



మణికంఠను బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

అల్లిపురం: మానసిక వ్యాధితో బాధపడుతూ ఆస్పత్రి నుండి తప్పించుకున్న వ్యక్తిని మూడు గంటల్లోనే మహారాణిపేట పోలీసులు వెతికి పట్టుకున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30కు పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి వచ్చిన సమాచారం మేరకు శాంతినికేతన్ ఆస్పత్రి నుంచి తప్పించుకున్న జామి మణికంఠ కోసం సీఐ దివాకర్ యాదవ్ తన సిబ్బందితో గాలించగా జగదాంబ జంక్షన్‌లో రాత్రి 9.30 గంటల సమయంలో అతన్ని కనుగొని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్‌కు సంపూర్ణ మద్దతు

అల్లిపురం: ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోరుతూ ఈ నెల 22వ తేదీ నుండి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ప్రకటించిన బంద్‌కు అఖిల భారత విద్యార్థి సమాఖ్య సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ తెలిపారు. ఈ మేరకు అల్లిపురం సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రూ.4200 కోట్లకు పైగా ఫీజు రియంబర్స్‌మెంట్, రూ.2200 కోట్లకు పైగా స్కాలర్‌షిప్ బకాయిలు ఉన్నాయన్నారు. ఆ బకాయిలను విడుదల చేయకపోతే విద్యార్థుల చదువు ఎలా కొనసాగుతుందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగ భూషణ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేఖర్, నాగరాజు, హేమంత్, సుమన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రిలే నిరాహార దీక్షలు



ఉద్యమ కార్యాచరణతో కూడిన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

అల్లిపురం: సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ రిలే నిరాహారదీక్షలు చేపట్టింది. దీంట్లో భాగంగా శనివారం గ్రీన్‌పార్కు రోడ్డులో గల విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఈపీడీసీఎల్ డిస్కం యూనిట్ చైర్మన్ వీఎస్ఆర్‌కే గణపతి పోస్టర్లు ఆవిష్కరించారు. తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని 11 జిల్లా కేంద్రాల్లో శుక్రవారం నుంచి విద్యుత్ ఉద్యోగులు రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారని తెలిపారు. గత పది నెలలుగా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని యాజమాన్యాలకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడంతో దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.

28న పౌర ప్రజా సంఘాల సదస్సు

టీవీరోడ్డు: మహాత్మా జ్యోతిబాపూలే సత్యసాధక సమాజ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా, సర్దార్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఈనెల 28వ తేదీన అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో మనువాద కార్పొరేట్ ఫాసిజం మూలాలు–ప్రజా ఉద్యమ కర్తవ్యాలపై పౌర ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు పౌర ప్రజా సంఘాల సమన్వయకర్త పాత్రపల్లి చంద్రశేఖర్ తెలిపారు. సంబంధిత కరపత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 ఏళ్ల కాలంలో దేశ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతూ కులాల పేరుతో ప్రజలను మధ్యయుగం నాటి కాలానికి తీసుకువెళ్లే ప్రయత్నం విస్తృతంగా చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు నెయ్యాలా నాగభూషణరావు, లలిత, పద్మ, అనురాధ రామకృష్ణ, లక్ష్మీ తిరుపతి రావు, శివలక్ష్మి, జయ తదితరులు పాల్గొన్నారు

వచ్చేనెల 12న వైజాగ్ హాఫ్ మారథాన్

దాబాగార్డెన్స్: వైజాగ్ ట్రయల్ రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 12న వైజాగ్ హాఫ్ మారథాన్ 4వ ఎడిషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు, రేస్ డైరెక్టర్ డాక్టర్ కె.కృష్ణచైతన్య తెలిపారు. శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గీతం కాలేజీ నుంచి ఈ మారథాన్ కార్యక్రమం ఉంటుందని, పోటీలో నాలుగు విభాగాలు ఉంటాయన్నారు. పోటీలో పాల్గొనే ఆసక్తి గల వారు ముందుగా తమ పేర్లను www.vtra.run ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు యోగేష్, రవి, శ్రీరామ్, యశ్వంత్, శ్రీధర తదితరులు పాల్గొన్నారు.